ఆంధ్రప్రదేశ్ - జనవరి 1999

# విలువల వెల ఎంత?

"ఈ ఏడు స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా, మన అన్ని ఆఫీసుల భవనాల ఆవరణల్లోనూ పతాకావిష్కరణ చేసి, పతాకవందనం చెయ్యాలని మేనేజింగ్ డైరెక్టర్ నిన్న సాయంత్రం మెయిన్ ఆఫీసులో జరిగిన మీటింగ్‌లో ఆదేశించాడు. నువ్వీరోజు రీసెర్చి లేబొరేటరీస్ కాన్ఫరెన్స్‌కి వెడ్తున్నావు కదా, తిరిగి వచ్చేటప్పుడు బజారు కెళ్లి ఓ మంచిరకంజెండా తీసుకొని రా. పి.ఏ. ఇవ్వాళ సెలవు మీదున్నాడు. రేపు రాగానే అతనికి రశీదిచ్చి, ఇంప్రెస్ట్‌లోంచి డబ్బు తీసుకో. అన్నట్లు కాన్ఫరెన్స్‌కి కారు తీసుకు వెళ్ళు. హుందాగా ఉంటుంది. నాకు సాయంత్రం వరకూ కారు అవసరం లేదు. నిన్ను తీసుకు వెళ్ళమని, పనయ్యేవరకూ నీతోనే ఉండమని డ్రైవరుతో అప్పుడే చెప్పాను" అని జనరల్ మేనేజర్ నాకు టెలిఫోను చేసి చెప్పాడు.

కారు విషయంలో మనసు మార్చుకొంటాడేమోనని, వెంటనే బయలు దేరాను. పదకొండు నుంచి ఒంటిగంట దాకా జరిగిన కాన్ఫరెన్స్ బిజినెస్ లంచ్‌తో ముగిసింది. డ్రైవరుతో రఘునాథ్ బజారుకి పోనిమ్మని చెప్పాను. అక్కడ చాలా బట్టల దుకాణాలూ, ఖాదీ బండార్లూ ఉన్నాయి. రఘునాథ్ మందిర్ దగ్గర ఖాళీ జాగాలో కారాపించి, దిగి, ఖాదీ బండార్‌కి వెళ్ళాను. నడుం ఎత్తు షోకేస్ వెనక చేతుల్లేని కుర్చీలో కూర్చున్న నడివయసు సేల్స్‌మన్, ఏం కావాలన్నట్టుగా చూశాడు కాని, నోరు విప్పి మట్టుకు అడగలేదు.

"జాతీయపతాకం మరీ చిన్నదీ, మరీ పెద్దదీ కాకుండా మధ్య సైజులో ఉన్నది కావాలి" అన్నాను.

"ఖద్దరుదా, సిల్కుదా?" ముక్తసరిగా ప్రశ్నించాడు.

"రెండూ చూపించండి. ఏది బావుంటే అది కొంటాను" అన్నాను.

"రెండూ బాగానే ఉంటాయి. ఏది కావాలో చెప్పండి" అన్నాడు కాస్త విసుగ్గా.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "అమ్మేవాళ్ళు అన్నీ బాగానే ఉంటాయంటారు. కాని నిర్ణయం తీసుకొనేది కొనేవాడు. రెండూ చూపించండి" అన్నాను, కాస్త కర్కశంగా.

ఏమనుకొన్నాడో ఏమో రెండూ తీసుకొచ్చి బల్లమీద పెట్టాడు.

"సిల్కుది ఎనభై, ఖద్దరుది ఏభై" అన్నాడు సేల్స్‌మన్.

"చాలా పాత స్టాకులా ఉంది" అన్నాను జెండాల్ని విప్పి చూస్తూ.

"ఈ జెండాల అవసరం ఏడాదికి రెండుసార్లు. ఈ ఏడాది స్వర్ణోత్సవాలు కాబట్టి ఈ వారం రోజుల్లోనూ ఓ ఇరవై దాకా అమ్ముడుపోయాయి. అయినా ఇప్పుడున్న స్టాకు శతవర్షోత్సవాల వరకూ సరిపోతుంది! ఇక్కడ తప్ప మీకు జెండా లెక్కడా దొరకవు. ఆపైన మీ యిష్టం" అన్నాడతను.

"సరే, సిల్కుది పేక్ చేయ్యండి" అన్నాను. అతను ఓ న్యూస్‌పేపర్లో జండాని మడతపెట్టి చుట్టి, పురికొన కట్టాడు. డబ్బిచ్చి ఆఫీసు పేరిట రశీదు వ్రాయమన్నాను.

"ఎంతకు వ్రాయమన్నారు?" నాకేసి అదోలా చూస్తూ చిన్నగా నవ్వుతూ అడిగాడు.

అతని ఉద్దేశ్యం నాకు తెలిసిపోయింది.

"నేనటువంటి వాణ్ణి కాను" అన్నాను కోపంగా.

"కోప్పడకండి సార్! మీ ఆఫీసు వాళ్ళెవరో ఆ మధ్య ఖద్దరు సిల్కు పరదా గుడ్డలు కొన్నారు. ఇరవైశాతం ఎక్కువ బిల్లు వ్రాయించుకొన్నారు! ఆఫీసుల తరపున కొనుగోళ్ళకి వచ్చేవాళ్ళు రూపాయిలో పావలాకి కక్కుర్తిపడ్తున్నారు. అంతెందుకు, ఇంతవరకు అమ్మిన జెండాలకి అసలు రశీదుల్లో హెచ్చు ధర వ్రాసిచ్చి, కార్బన్ కాపీల్లో అసలు ధర వ్రాసుకొన్నాను! అందుకనే మిమ్మల్ని అలా అడిగాను. మీరేం అనుకోకుండా క్షమించండి" అన్నాడు. పక్కన పెట్టిన కార్బన్ పేపర్ని రశీదు బుక్కులో పెట్టి రశీదు వ్రాసిచ్చాడు.

నాకు కొద్దిగా కోపం తగ్గింది. నిజానికతని తప్పేమీ లేదు.

"మీరన్నది నిజం కావచ్చు కాని దేనికైనా ఓ హద్దనేది ఉండాలి. కనీసం జాతీయ పతాకం విషయంలో కొనేవాళ్ళూ, అమ్మేవాళ్ళూ నిజాయితీ చూపించవలసిన ధర్మం ఉంది. జాతీయపతాకం గౌరవాన్నీ, పవిత్రతనీ న్యూనతపరచకూడదు" అన్నాను అనునయంగా.

కాస్తంత చిన్నబుచ్చుకొన్నాడు. ఒక్కక్షణం ఆగి "మీరన్నది నిజం. కాని ఒక్కమాట! ఆగష్టు పదిహేను, జనవరి 26 తేదీలలో దేశంలో ఎన్నివేల పతాకాలు ఎగరవేస్తారో నా ఊహకి అందదు కాని, ఆ పతాకాన్ని ఆవిష్కరించేవాళ్ళలో ఎంతమంది చేతులు పవిత్రమైనవో, వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చుసార్!" అన్నాడు నెమ్మదిగా.

జాతీయ పతాకాన్ని మనం ఎంత ఎత్తుగా ఎగరవేస్తున్నా నైతికంగా దాన్నెప్పుడో పతనం చేశామన్న పెద్ద ఆలోచన అతనన్న చిన్న మాటలతో కలిగింది. జెండా పేకెట్ తీసుకొని మౌనంగా బయటకి దారి తీశాను.